ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం అక్టోబరు 10, 2024


పూజల్లో పాల్గొన్న చిన్నారులు

30 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ

కాకినాడ గ్రామీణంలోని రమణయ్యపేట శ్రీపీఠంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని ఐశ్వర్యాంబికను సరస్వతీ దేవిగా అలంకరించారు. 30 వేల మంది విద్యార్థులతో ఉచిత త్రికోటి సరస్వతి పూజలు, 200 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మేధాసూక్త సరస్వతి హోమం, లక్ష ఫలార్చణ నిర్వహించారు. వీణాపాణి అనుగ్రహం ప్రతి విద్యార్థిపై ఉండాలని స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆకాంక్షించారు. ప్రముఖ కవి, ఆధ్యాత్మికవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు అనుగ్రహభాషణ చేశారు. **-న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్**

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తపాలా వారోత్సవాల్లో భాగంగా కరవాక, ఆత్రేయపురం, కేశనకుర్రుపాలెం, నగరం గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తపాలా అధికారి నవీన్ కుమార్ తెలిపారు. వీటిలో ఆధార్ నవీకరణ, చరవాణి నంబర్లు అనుసంధానం, చిరునామా మార్పు, తదితర సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నయనం.. నయా కష్టం



నేడు ప్రపంచ కంటిచూపు ప్రాముఖ్యత దినం

ఈనాడు, కాకినాడ

తరచూ తలనొప్పి వస్తోంది.. కళ్లు పొడిబారుతున్నాయి.. మంట.. ఎర్రగా మారి నేత్రాలు దురద పెడుతున్నాయి. చూపు మసకబారుతోంది.. ఎక్కువ మందిలో కనిపిస్తున్న ఇబ్బందు లివి. వృద్ధాప్యంలో చూపు మందగించడం సహజం..ఇప్పుడు చిన్నారుల్లో సైతం దృష్టిలోపాలు దర్శనమిస్తున్నాయి. కారణం స్మార్ట్ వ్యసనం.. మొబైల్, ట్యాబ్‌లు, కంప్యూటర్లు, టీవీలను గంటలకొద్దీ చూడడమే అంటున్నారు నిపుణులు.

ఆసుపత్రులకు వస్తున్న కేసుల్లో..

కళ్లు మసకబారడంతో వచ్చేవారు 60, పొడిబారడం 20, తలనొప్పి 10, కళ్లనుంచి నీరుకారడం వంటి సమస్యలతో వచ్చేవారు 5 శాతం ఉన్నారు.

- ఉమ్మడి జిల్లాలో కంటిశుక్లాలతో బాధపడే వారు 62 శాతం ఉండగా వక్రీభవన లోపాలతో 20, గ్లకోమా 6, జన్యుపరమైనవి 6.5, కంటిపొర 4.5, శస్త్రచికిత్సలు జరిగాక ఇబ్బందులు పడే వారు 1 శాతం ఉన్నారు.


పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు (పాత చిత్రం)

వీటితో మేలు

- క్యారట్, క్యాప్సికం, పాలకూర, చిలగడదుంప, నారింజ, బొప్పాయి, కర్బూజా, చేపలు, పీతలు, మాంసం, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, వేయించిన సోయాబీన్స్ కంటికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

- ప్రతి 20 నిమిషాలకోసారి కళ్లకు విశ్రాంతి ఇవ్వడం.. 20 అడుగుల దూరం ఉన్న వస్తువులను 20 సెకన్లపాటు చూడడం.. రెప్పలు ఆడించడం వంటివి చేయాలి. వీలైతే కంప్యూటర్, మొబైల్‌లో ఫాంట్స్ పెద్దవిగా చేసుకుని చూడడం, యాంటీగ్లేర్ వంటి రక్షణ ఇచ్చే కళ్లద్దాలు వాడడం వంటి ప్రక్రియలతో కంటిపై ఒత్తిడి తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద.. (అక్టోబర్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
నేత్ర శస్త్రచికిత్సలు	1,960	1,624	1,124
కళ్లజోళ్ల లబ్ధిదారులు	26,420	28,429	32,359

పాఠశాలల్లో నేత్ర పరీక్షల తీరిదీ.. (ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు..)

విషయం	కాకినాడ	తూర్పు గోదావరి	అంబేడ్కర్ కోనసీమ
శిబిరాలు జరిగిన పాఠశాలలు	215	74	131
కంటి పరీక్షలు	24,199	10,383	19,461
కళ్లద్దాలు అవసరమైనవారు	1,150	327	772
ఇతర నేత్ర సమస్యలతో..	29	23	6

కాపాడుకుందాం..

ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు కాకినాడ జిల్లాలో 3.48 లక్షల మంది విద్యార్థులుంటే.. తూర్పుగోదావరిలో 3.14 లక్షల మంది, కోనసీమలో 2.41 లక్షల మంది ఉన్నారు. స్క్రీన్‌టైం పెరగడం వీరిలో సమస్యకు ప్రధాన కారణమవుతోంది. 'సి' విటమిన్ లోపించడం, హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్, మధుమేహానికి తోడు కంప్యూటర్, మొబైల్, టీవీ ముందు ఎక్కువ సేపు గడపడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

కంటిపై ఒత్తిడి తగదు..

కంటిపై ఒత్తిడి పెరిగితే అనర్థాలే.. 40 ఏళ్ల వయసు దాటితే దృష్టిలోపం రావడం సహజం. కానీ ఇప్పుడు చిన్న పిల్లలు, యువతలోనూ సమస్యలు ఎక్కువవుతున్నాయి. స్క్రీన్ టైం పెరగడంతో వచ్చే ఇబ్బంది ఇది. పాఠశాలల్లో నేత్ర సర్వే ద్వారా సమస్యలు గుర్తించాం. ప్రత్యేక శిబిరాల్లో పెద్దల్లోనూ కంటి ఇబ్బందులు గుర్తించి శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు అందిస్తున్నాం. 60 ఏళ్లు దాటిన వారిలో శుక్లాల సమస్య ఉంటే ముదిరిపోకుండా శస్త్రచికిత్స చేసుకోవడం మేలు.



- డాక్టర్ పి.వి.ప్రసాద్, ప్రోగ్రాం మేనేజర్, అంధత్వ నివారణ సంస్థ, కాకినాడ జిల్లా

రైతుకు అండ



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం బస్తాను తూకం వేసి చూస్తున్న మనోహర్.. చిత్రంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి, కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు. **-న్యూస్‌టుడే, చాగల్లు**

413 మద్యం దుకాణాలు.. 7,350 దరఖాస్తులు

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ ఇవ్వగా బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 7,350 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ఈనెల 11 వరకు గడువు పొడిగించింది. 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారుచేస్తారు. 16 నుంచి దుకాణాలు ప్రారంభించుకునే వెసులుబాటు కల్పిస్తారు. దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

పరిశీలిస్తే: దుకాణాలు తక్కువగా ఉన్న తూర్పుగోదావరిలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాతి స్థానంలో కోనసీమ ఉంది. అత్యధికంగా మంజూరైన కాకినాడలో దరఖాస్తులు తక్కువగా రావడం చూస్తే రాజకీయ జోక్యం, గతంలో ఈ వ్యాపారం మీద పట్టు ఉన్నవారు దక్కించుకోడానికి సిండికేట్ వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

- కోనసీమ జిల్లాలో 121వ దుకాణానికి కేవలం రెండు, 125వ దుకాణానికి మూడు దరఖాస్తులే రావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధికంగా 66వ నంబర్ దుకాణానికి 45, నాలుగో నంబరుకు 44, రెండో నంబరు దుకాణానికి 41 చొప్పున వచ్చాయి. ● తూర్పుగోదావరిలో అత్యధికంగా 46వ నంబర్ దుకాణానికి 54, అలానే 55వ దుకాణానికి 46 అందాయి.

జిల్లా	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు (9వ తేదీ నాటికి)
కాకినాడ	155	1,716
తూర్పుగోదావరి	125	2,896
అంబేడ్కర్ కోనసీమ	133	2,738


కాకినాడలోని అబ్కారీశాఖ కార్యాలయం

అతుకుల బండి.. సేవలు ఎలాగండి


శిథిల స్థితికి చేరుకున్న అమలాపురం 108 వాహనం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో 108 వాహనాలు 22 | పైలెట్లు: 53 | టెక్నీషియన్లు 55 | ఒక్కో వాహనం సరాసరి ప్రయాణం 300 కి.మీ.

అత్యవసర సేవలు అందించే 108 వాహనాలు మరమ్మతులతో మూలుగుతున్నాయి. గత ప్రభుత్వం నిర్వాకం కారణంగా సమస్యలు పెరుగుతూ వస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా మెరుగైన సేవలు అందించేలా గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

5 లక్షల కిలోమీటర్లు తిరిగినా..: వీటి నిర్వహణ పనులను అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ నిర్వహిస్తోంది. ఒక్కో వాహనం సుమారు 5 లక్షల కిలోమీటర్లు తిరిగినా కొనసాగిస్తుండటం గమనార్హం. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే పైలెట్‌నే బాధ్యుడిని చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

రిఫరల్ కేసులే ఎక్కువ..: కోనసీమలోని వివిధ ఆసుపత్రుల నుంచి కాకినాడ జీజీహెచ్‌కు రిఫరల్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. అమలాపురం నుంచి కాకినాడ రానూపోనూ 150 కి.మీ. దూరం. రెండు సార్లు వెళ్తే 300 కి.మీ. వస్తోంది. అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రులు, అమలాపురం కిమ్స్ నుంచి రోజుకు సరాసరి అయిదు కేసులను కాకినాడ రిఫర్ చేస్తున్నారు.

నెట్టాల్సిందే.. : 22 వాహనాల్లో 16 వరకు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పి.గన్నవరం, సఖినేటిపల్లి, అయినవిల్లి, ముమ్మిడివరం మండలాల్లోని వాహనాలది ఇదే పరిస్థితి. సఖినేటిపల్లి, గన్నవరం వాహనాలకు సెల్ఫ్‌స్టార్ట్ లేదు. ఇవి కదలాలంటే నెట్టాల్సిందే.

అందని వేతనాలు.. : సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా వారంతపు సెలవులు ఇవ్వడంలేదని సిబ్బంది వాపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్, బీమా గురించి యాజమాన్యం, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

-అజయ్, 108 వాహన పర్యవేక్షకుడు, అమలాపురం

315 పంచాయతీల్లో 766 పనులు

అమలాపురం కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పల్లె పండగ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ సభల్లో అనుమతులు పొందిన పనులను ప్రారంభించాలన్నారు. జిల్లాలో 315 పంచాయతీల పరిధిలో రూ.54.30 కోట్ల ఉపాధి మెటీరియల్ కాంపోనెట్ నిధులతో 766 పనులకు అనుమతులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో రూ.50 కోట్లతో 84.17 కి.మీ.మేర సీసీ రహదారులు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. డ్వామా పీడీ మధుసూదన్, డీపీవో శాంత లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వంతెన.. ట్రాఫిక్ ఇంతేనా..?



ఈదరపల్లి వంతెన మీదుగా అమలాపురంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోంది. బుధవారం మధ్యాహ్నం వాహనాలు నిలిచిపోయాయి. పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం



ఉద్యానవనం ప్రధాన శాస్త్రవేత్తగా మమత

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలోని అఖిలభారత వన్యతోట పంటల సమన్వయ పథకం ఉద్యాన విభాగంలో ప్రధాన శాస్త్రవేత్తగా ఎం.మమత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటివరకు ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం, కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రంలో సేవలందించారు. బదిలీపై ఇక్కడికి వచ్చారు. పసుపు, చామ, చిలగడదుంప, కర్రపెండలం, అరటి పంటలపై పరిశోధనలు చేసిన మమతకు స్థానిక పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావుతో పాటు తోటి శాస్త్రవేత్తలు స్వాగతం పలికారు.

ఉన్నత విద్యకు 'ప్రతిభ' ఉపకార వేతనాలు

నవంబరు 11 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ప్రతిభకు పేదరికం అడ్డుకారాదనే లక్ష్యంతో ప్రవాస భారతీయుడు చక్కపల్లి రమేష్ 2012లో 'ప్రతిభ' స్కాలర్‌షిప్ ట్రస్ట్ స్థాపించారని కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఖాన్ బుధవారం తెలిపారు. ఐఐటీ, నీట్, జేఈఈ, ఇంజినీరింగ్, మెడిసిన్ 2024- 25లో ప్రవేశం పొందగోరే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రతిభావంతులను ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఉపకార వేతనం అందిస్తామన్నారు. ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి, పేదరిక కుటుంబంలోని వారికి ప్రాధాన్యముంటుందని, ఎంపికైన వారికి కోర్సు పూర్తయ్యేంతవరకు స్కాలర్ షిప్ అందజేస్తామన్నారు. దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ప్రతిభస్కాలర్‌షిప్.కామ్ వెబ్‌సైట్ నుంచి తీసుకుని నవంబరు 11లోపు పంపాలన్నారు. దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, శ్రీ గణపతి వెంకట సత్యసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏలేశ్వరం, 533429 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 9951367872, 9948417174 నంబర్లను సంప్రదించాలి.

నేటి నుంచి బాలయోగి బాస్కెట్‌బాల్ పోటీలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో 9వ సబ్ జూనియర్స్ బాలబాలికల అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం గురువారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్ తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ప్రారంభిస్తారన్నారు. 12న జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు ఎంపీలు గంటి హరీష్‌మాథుర్, పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరవుతారన్నారు.

జేఎన్‌టీయూకేలో ప్రొఫెసర్ హోదాపై వివాదం

కోర్టుకు రావాలని ఇన్‌ఛార్జి వీసీకి నోటీసులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకేలోని గ్రంథాలయ విభాగంలో పనిచేస్తున్న దొరస్వామి నాయక్‌కు ప్రొఫెసర్ హోదా వివాదం తారస్థాయికి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, ప్రొఫెసర్ హోదా ఇవ్వాలని దొరస్వామి గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. గత వీసీలు ఈ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో ఆయన 2021లో నేషనల్ కౌన్సిల్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్ (ఎన్‌సీఎస్‌టీ)ను ఆశ్రయించారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని జేఎన్‌టీయూకే అథారిటీ, ఉన్నత విద్యాశాఖను ఎన్‌సీఎస్‌టీ అప్పట్లోనే ఆదేశించింది. దీనిపై కమిటీ వేసి, పాలకమండలిలో తీర్మానించాక హోదా ఇస్తామని అప్పట్లో సంజాయిషీ ఇచ్చారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేకపోవడంతో తిరిగి 2023లో ఆయన ఎన్‌సీఎస్‌టీని ఆశ్రయించారు. తాజాగా ఆగస్టులో మరోసారి ఫిర్యాదు చేశారు. ఎన్‌సీఎస్‌టీ దీనిపై స్పందించింది. దిల్లీలోని ట్రైబ్ కోర్టుకు హాజరు కావాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతికి బుధవారం నోటీసులు జారీ చేసింది.

తలుపులు ఇలా.. మరుగు ఎలా..?



పుల్లేటికుర్రు ఉన్నత పాఠశాలలో 400 మంది పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో బాలికలే ఎక్కువ. వీరికి అవసరమైన మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. తలుపులు ఊడిపోయాయి. దీంతో బాలికలకు మరుగులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా రోజుల నుంచి ఈ సమస్య ఉంది. దీనిపై మండల విద్యాశాఖాధికారి మోకా ప్రకాష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాఠశాల నిర్వహణ నిధులు గత నాలుగేళ్ల నుంచి విడుదల కాకపోవడంతో తలుపులు మరమ్మతు చేయించేందుకు ఆస్కారం లేకుండా పోయిందన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట



అయినవిల్లి: పద్మావతి అమ్మవారు



మండపేటలో సరస్వతీ దేవిగా..



ద్రాక్షారామ మాణిక్యాంబ..

విద్యా ప్రదాయిని నమోస్తుతే..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం

12 ఇసుక రేవుల గుర్తింపు




సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి ప్రవాహం తగ్గాక ఇసుక తవ్వకాలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో 12 రీచ్‌లను గుర్తించామన్నారు. ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి విధివిధానాలు గురువారం సాయంత్రంలోగా ఖరారు చేయాలని గనులశాఖ అధికారులను ఆదేశించారు. పట్టా భూముల్లో తవ్వకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారన్నారు. ఇసుక రీచ్‌లలో రోజూ ఉదయం 6 గంటల నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. ఎస్పీ కృష్ణారావు, జేసీ నిశాంతి, ఆర్డీవోలు మాధవి, శ్రీకర్, కతీబ్‌కౌషర్ బానో, జిల్లా గనుల శాఖ అధికారి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిద్దాం.. సమస్యను తరిమేద్దాం

☛ గంజాయికి బానిసలైన తుని పట్టణానికి చెందిన కొందరు యువకులు అది దొరకని పరిస్థితుల్లో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై గొడవలు, దాడులకు దిగారు. కొంతకాలం క్రితం ఎస్‌ఏరోడ్డులోని ఓ కొబ్బరిబొండాలు అమ్మే వ్యక్తిని, అతని కుమారుడిని చితకబాదారు. వీరిని పట్టుకుని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

☛ కాకినాడకు చెందిన 16 ఏళ్ల బాలిక 10వ తరగతి తప్పడంతో చదువు మానేసి ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతూ మందులు వాడుతోంది. తనలో తాను మాట్లాడుకోవడం, చచ్చిపోవాలని ఉందంటూ కుటుంబ సభ్యులతో చెప్పేది. ఈ క్రమంలో ఇటీవల చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది.



మసీదు సెంటర్ (కాకినాడ), తుని, న్యూస్‌టుడే: ఆధునిక పోటీ ప్రపంచంలో మనిషి నిత్యం కాలంతో పరుగుపెట్టాల్సిన ఆవశ్యకత పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత కాలంలో ఆర్థిక, సామాజిక, శారీరక ఇలా వివిధ కారణాలతో ఒత్తిడికి గురై మానసిక అనారోగ్యంతో అనేకమంది బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి వివిధ రూపాల్లో చిన్నా పెద్దా అందరినీ కుంగదీస్తున్న ప్రధాన సమస్య.

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఇలా చేద్దాం

- సూర్యోదయానికి ముందే లేచి వ్యాయామం, యోగా చేయాలి
- అల్పాహారంలో నూనె, మసాలాలు వాడిన పదార్థాలు తగ్గించాలి.
- పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలున్న ఆహారం తీసుకోవాలి.
- రోజూ విధి నిర్వహణే కాకుండా ఆధ్యాత్మిక చింతన, మొక్కలు, పక్షులు, జంతువుల పెంపకంపై దృష్టి పెట్టాలి.
- బంధుమిత్రులతో సమయం గడపాలి.
- క్రీడలు, చిత్రలేఖనం, కథలు, వ్యాసాలు రాయడం వంటి వాటిని అలవాటు చేసుకోవాలి.
- పిల్లలు సెల్‌ఫోన్లను వినియోగించకుండా ఉండేందుకు వారికి చదవు, ఆటపాటలతో పాటు ఇంటి పనులు కూడా అలవాటు చేయాలి.
- విహార యాత్రలకు వెళ్లడం, సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం మానసికోల్లాసానికి దోహదపడతాయి.

మనోవ్యాధికి మందు లేదనేది అపోహ...



మనోవ్యాధికి మందు లేదనేది అపోహ మాత్రమే. చాలావరకు మానసిక సమస్యలు మెదడులోని రసాయనిక మార్పుల వల్ల వచ్చేవే కాబట్టి మందులతో చాలా వరకు నయం అవుతాయి. కౌన్సిలింగ్ ద్వారా మరికొన్ని సమస్యలకి పరిష్కారం దొరుకుతుంది.

- డా.వరప్రసాద్, జీజీహెచ్ మానసిక వైద్యనిపుణులు

ఆహ్లాదకర వాతావరణంలో పని..



ఆరోగ్యపరమైన, భద్రత కలిగిన వాతావరణం పని ప్రదేశాల్లో కల్పించినప్పుడే ఎక్కువ ఉత్పాదకత సాధించి దేశం ఆర్థికాభివృద్ధి చెందుతోంది. ఆహ్లాదకరమైన, ఒత్తిడి రహితమైన పని పరిస్థితిని కల్పించే బాధ్యత ప్రభుత్వం, యాజమాన్య సంస్థలు తీసుకోవాలి. పని వల్ల కలిగే తీవ్ర ఒత్తిడి వల్లే మానసిక ఆరోగ్యం దెబ్బతింటోంది.

- డా.గోడవర్తి సత్యమూర్తి, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, కాకినాడ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా తరఫున పోటీచేసే అభ్యర్థిని గెలిపించుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కూటమి నాయకులు నిర్ణయించారు. కాకినాడ రామారావుపేటలోని జిల్లా తెదేపా కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షత వహించగా, పరిశీలకునిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని తెదేపా అధినేత చంద్రబాబు నిర్ణయిస్తారన్నారు. తనను గెలిపించుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. మూడు పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిని నిలపలేదన్నారు. యువత, కూటమి సానుభూతి పరులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, దాట్ల బుచ్చిబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, వరుపుల సత్యప్రభ, పంతం నానాజీ, మిరియాల శిరీష, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, పెందుర్తి వెంకటేష్, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, జిల్లా భాజపా అధ్యక్షుడు రామ్‌కుమార్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనందసాగర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో యనమల, చినరాజప్ప, తదితరులు

పురవీధులు.. రణవేదికలు

సాహసాల చెడీ తాలింఖానా యుద్ధ విద్యల ప్రదర్శన

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

దసరా వచ్చిందంటే చాలు.. అమలాపురంలోని వీధివీధినా సందడే. ఆ రోజు జరిగే చెడీ తాలింఖానా ప్రదర్శనలు చూసి తీరాల్సిందే. కత్తులు, కర్రలతో యుద్ధ విద్యలు, సాహసోపేత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఉత్సవాలకు పక్షం రోజుల ముందు నుంచే సన్నాహక కార్యక్రమాలతో సందడి ప్రారంభమైంది.

ఇదీ నేపథ్యం..: స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా భారతీయుల ఐక్యత కోసం దేశవ్యాప్తంగా అప్పటి నాయకులు దసరా, వినాయక చవితి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించేవారు. విజయదశమిని పురస్కరించుకుని కొంకాపల్లిలో 1835లో తొలిసారిగా చెడీ తాలింఖానా ప్రదర్శనలకు భీజం పడింది. 1856లో అబ్బిరెడ్డి రామదాసు మహిపాలవీధిలో ప్రారంభించారు.

ఈ ఏడాదికి సర్వం సిద్ధం..: ఈ నెల 12న పట్టణంలోని పలు వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కొంకాపల్లిలో 189వ, మహిపాల వీధిలో 169, గండువీధిలో 114, రవణంమల్లయ్య వీధిలో 109, శ్రీరామపురంలో 80, రవణం వీధిలో 77, నల్లావీధిలో 58వ విజయదశమి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ

యుద్ధ విద్యల ప్రదర్శన: కత్తి, కర్రసాము, అగ్గిబరాటా, మేతబాణ, పటాకత్తులు, లేడికొమ్ములు, మార్వాడి కొమ్ములు, బల్లెము, డాలు, రింగులు, బంతు తాళ్లతో చేసే ప్రదర్శనలు ఆద్యంతం ఉత్కంఠకు గురి చేస్తాయి. కళ్లకు గంతలు కట్టుకుని మనిషి పొత్తికడుపు, కంఠంపై కొబ్బరి, ఆనబ, అరటి, బీర కాయలు నరికే దృశ్యాలు గగుర్పాటు కలిగిస్తాయి. గరగనృత్యాలు, శక్తివేషాలు, వనకన్యల నృత్య ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు హైదరాబాద్, ఇతర దూర ప్రాంతాల నుంచి జనం తరలి వస్తారు.



ఆలయ ప్రాంగణంలో సాధన చేస్తున్న బాలికలు



కళ్లకు గంతలు కట్టుకుని పొట్టపై కొబ్బరికాయను, సొరకాయను నరుకుతున్న అబ్బిరెడ్డి మల్లేష్

ఊరేగింపులో జాగ్రత్తలు తీసుకోండి

అమలాపురం పట్టణం: విజయదశమి ఊరేగింపు సందర్భంగా పట్టణంలో ఉత్సవ కమిటీల నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీ ప్రసాద్ సూచించారు. అమలాపురంలోని ఏడు ఉత్సవ కమిటీల నాయకులతో బుధవారం ఏఎస్పీ సమావేశమయ్యారు. కత్తి, కర్రసాము, అగ్గిబరాటాతో చేసే విన్యాసాలు ఇతరులకు తగలకుండా చూడాలన్నారు. డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: లారీ యజమానుల సంఘ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలని అమలాపురం లారీ యజమానుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నల్లం రాంబాబు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ లారీ యజమానుల సంఘానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉమ్మడి జిల్లాలోని 29 సంఘాల యూనియన్ నాయకులు సత్కరించారు. స్థానిక సంజయ్‌నగర్ లారీ యజమానుల సంఘ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో యూనియన్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చిస్తామన్నారు. బలభద్రపురం, రాజమహేంద్రవరం, రాజోలు లారీ యజమానుల సంఘం నాయకులు సుధాకరరెడ్డి, బాబు, కాయల రమేష్, బొక్కా త్రిమూర్తులు తదితరులు సంఘీభావం తెలిపారు.

బాలిక అపహరణ, అత్యాచారం కేసులో నిందితుడు, ఓ మహిళ అరెస్టు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడు, అతనికి సహకరించిన మహిళను పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం పిఠాపురం పట్టణ సీఐ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన బాలికను అపహరించి ఆటోలో మాధవపురం రోడ్డులోని గోదావరి కాలువగట్టు వద్దకు తీసుకువెళ్లి ఆమెతో మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. తక్షణమే కేసు నమోదు చేశామని.. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో నిందితులను పట్టుకోవడానికి పట్టణ ఎస్సై మణికుమార్, గ్రామీణ ఎస్సై గుణశేఖర్, గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణలతో మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని అయితేనగర్‌కు చెందిన నిందితుడు దుర్గాడ లక్ష్మయ్య అలియాస్ జాన్, అతడి స్నేహితురాలు రథాలపేటకు చెందిన కొంగుపూడి సుబ్బలక్ష్మిని బుధవారం అరెస్టు చేశామన్నారు.

ఇప్పటికే తొలగించిన తెదేపా..

నిందితుడు జాన్ పిఠాపురం పట్టణంలోని తెదేపా మహిళా నాయకురాలి భర్త. తెదేపా కార్యకర్త కూడా అయిన అతన్ని అధిష్ఠానం మంగళవారమే పార్టీ నుంచి తొలగించింది.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		11,500
పాతకాయ:	గండేరా	17,500
	గటగట	15,500
కొత్తకాయ:	గండేరా	16,500
	గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		14,000-15,000
కొత్త (పచ్చి) కాయ		13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయము, ఎయిమ్స్ కాలేజ్, ముమ్మిడివరం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533216

టెండరు ప్రకటన

నెం. No.Mktg.A8/Gunny Transport/KMS 2024-25 — ది. 08-10-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గల పౌర సరఫరాల సంస్థలో 2024-2025 సంవత్సరం కొరకు అనగా తేదీ 30-09-2025 అంతమయ్యే కాలమునకు జిల్లాలో గల అన్ని SWC/CWC బఫర్ గోదాముల/ PPCs/ RBKs/ Rice Mills మరియు మండల స్థాయి గోదాములు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గూడ్స్ షెడ్ నుంచి PPCs/ RBKs/ Rice Mills మరియు మండల స్థాయి గోదాములు మరియు ప్రభుత్వ నిర్దేశిత ప్రాంతాలకు గన్నీ సంచులు రవాణా చేయు నిమిత్తము అనగా రెండవ దశ రవాణా కాంట్రాక్టర్లను ఈ కాంట్రాక్ట్ నియమించిన నాడు నుండి తేది 30-09-2025 వరకు నియమించుటకు గాను తేది: 23-10-2024 మధ్యాహ్నం 1.00 గంట లోపల (పని దినములలో) టెండర్ ఫారంలు అమ్ముటకు నిర్దేశించబడినది. కావున ఉత్సాహము గలవారు ఏదేని జాతీయ బ్యాంకులో District Civil Supplies Manager, APSCSCL, Konaseema, payable at Amalapuram వారి పేరిట రూ. 5,600/- (Tender form Rs. 5000 + Rs.600 GST) లకు డిమాండు డ్రాఫ్టును చెల్లించి జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారి కార్యాలయము, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం నందు ఈ క్రింద వివరించిన షెడ్యూల్ ననుసరించి టెండరు ఫారము మరియు టెండరు నియమ నిబంధనలను పొందవలెను.

టెండరు షెడ్యూలు

1. టెండరు ఫారము అమ్మకము ప్రారంభ తేది (పని దినములలో)	తేది:10-10-2024 10.30 AM నుండి
2. టెండరు ఫారము అమ్మకము చివరి తేదీ / సమయము	తేది: 23-10-2024 1.00 PM వరకు
3. టెండరు ఫారము దాఖలు చేయుటకు చివరి తేదీ/ సమయము	తేది:23-10-2024 5.00 PM వరకు
4. టెండర్లు తెరచు తేదీ/ సమయము	తేది:25-10-2024 4.00 PM

సం/- శ్రీమతి టి.నిశాంతి, ఐ.ఎ.ఎస్.
సంయుక్త కలెక్టర్ మరియు వృత్తిరీత్యా కార్యనిర్వాహకాధికారి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

మత్స్యశాఖ

రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (SIFT), కాకినాడ

ఆర్.సి.నెంబర్ 695/C1/2021 — తేది:09-10-2024

రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ, కాకినాడ (నోడల్ సెంటర్) వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల వివిధ జిల్లాలలో గల ఆక్వా ల్యాబుల నందు కెమికల్స్, గ్లాసువేర్ మరియు కన్స్యూమబుల్స్ సరఫరా కొరకు ఆథరైజ్డ్ డీలర్స్ నుండి ఆఫ్‌లైన్ విధానంలో షార్ట్ టెండర్ నోటీసు ద్వారా సీల్డ్ కొటేషన్‌లు కోరడమైనది. పూర్తి వివరములు http://fisheries.ap.gov.in నందు ది. 10-10-2024 నుండి లభించును. అలాగే అదనపు సమాచారం కొరకు కార్యాలయపు పనివేళలలో సంప్రదించవచ్చును. షార్ట్ టెండర్ సీల్డ్ కొటేషన్స్ స్వీకరణకు ఆఖరి తేది. 19-10-2024 సాయంత్రం 05.00 గంటలు. ఫోన్ నెం. 0884-2378552/9440814723.

సం/- టి.సుమలత
ప్రిన్సిపాల్
రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ, కాకినాడ.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఇంద్రకీలాద్రిపై ముక్కామల గరగ నృత్యాలు

అంబాజీపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7, 8, 9 తేదీల్లో విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగ నృత్య బృందం ప్రదర్శన నిర్వహించారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ బృందంతో అక్కడ ప్రదర్శనలు ఇప్పించిన ఆయన బుధవారం తెలిపారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన పవిత్రమైన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌లోని మదీనాగూడకు చెందిన జయంతి వెంకట సూర్యనారాయణమూర్తి, రాజ్యలక్ష్మి దంపతులు బుధవారం రూ.47,500 విరాళం అందించారు. వీరికి దేవస్థానం పర్యవేక్షకుడు రాంబాబు స్వామివారి చిత్రపటం అందించారు.

మినీ గోకులాలకు 74 దరఖాస్తులు

ఆలమూరు: మండలానికి సంబంధించి మినీ గోకుల పథకం కోసం పశుపోషకుల నుంచి 74 దరఖాస్తులు వచ్చినట్లు ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా. ఎల్.అనిత బుధవారం తెలిపారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. 2018లో ఈ పథకం మొదలైనప్పుడు 44 మినీ గోకులాల నిర్మాణం జరిగిందన్నారు. మళ్లీ ఈ ఏడాది పశుసంవర్ధకశాఖ ఈ పథకాన్ని పునరుద్ధరించిందని, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు 74 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె తెలిపారు.

రసాయన ఎరువులు వాడొద్దు

సఖినేటిపల్లి: సాగులో ప్రకృతి ఎరువులు వాడాలని ఏవో నరసింహారావు అన్నారు. గొంది, గుడిమూల గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి సూచనలు ఇచ్చారు. సర్పంచులు రాజు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా



దోమల మందు పిచికారీ

మలికిపురం: మేడిచర్లపాలెంలో దోమల నివారణ మందును పారిశుద్ధ్య సిబ్బంది పిచికారీ చేశారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను సర్పంచి మేడిచర్ల వర్షిత్య, కార్యదర్శి సుభాకర్‌బాబు దృష్టికి తేగా స్పందించిన వారు వీధులు, డ్రైనేజీలు, కాలువ గట్టు వద్ద దోమల మందు పిచికారీ చేయించారు.

చెత్తాచెదారం తొలగింపు

రావులపాలెం పట్టణం: స్థానిక కొత్తకాలనీలో రోడ్డు చెంతన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

వీధులను శుభ్రం చేశారు

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో పలు వీధులు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కాయల జగన్నాథం వద్ద ప్రస్తావించగా స్పందించారు. వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

వెలగని విద్యుత్తు దీపాలు

మామిడికుదురు: లూటుకుర్రు శివారు వీధిని ఆనుకుని వీధి దీపాలు కొన్ని వెలగడం లేదని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి అడబాల తాతకాపు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. వెంటనే వాటిస్థానే కొత్త దీపాలను వేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

పంచాయతీ పాలన.. పరిపుష్టికి శిక్షణ

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

పల్లెలు అభివృద్ధి పథంలో పయనించాలంటే పంచాయతీ పాలన సమర్థంగా ఉండాలి. అందుకు పాలకవర్గాలకు అన్ని అంశాలపై పూర్తి అవగాహన అవసరం. అప్పుడే గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కచ్చితంగా కనిపిస్తుంది. గత వైకాపా పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యంగా మారింది. నిధులు ఇవ్వకపోవడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వాటిని సైతం మళ్లించేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పంచాయతీ పాలనకు పూర్వవైభవం తెచ్చే దిశగా ఆ శాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంకల్పించారు. ఈ మేరకు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలను అంతా సద్వినియోగం చేసుకున్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యులు

అందరి భాగస్వామ్యం.. అభివృద్ధి త్వరితం

రాజోలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2.42 లక్షల మంది జనాభా ఉన్నారు. ఇందులో యువత 1.25 లక్షల మంది. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు(పూర్తిగా) మండలాల్లో 70 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 824 మంది వార్డుసభ్యులు ఉన్నారు. పంచాయతీ పాలనపై పూర్తి అవగాహన దిశగా అన్ని అంశాలపై కొత్తవారిలో అవగాహన పొందిన ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు ఈ నెల 7, 8 తేదీల్లో మండల కేంద్రాల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాలు అన్నివిధాల అభివృద్ధి కావడానికి, వీటికి సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి అవసరమైన అవగాహన కల్పించారు. పారదర్శక పాలనలో భాగంగా కార్యాచరణ కమిటీల ద్వారా నిర్ణయించిన పనులను సాకారం చేసుకునేందుకు, భవన నిర్మాణాలకు అనుమతులు, లేఔట్లకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా తెలుసుకునేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన దిశగా శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహించారు.

అన్ని అంశాలు తెలుసుకున్నా..



ఆదాయ వనరులు సమకూర్చుకోవడం, తాగునీటి సరఫరా సక్రమ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవడం, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన చేసుకున్నాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే దిశగా శిక్షణ ఉపయోగపడింది. – అప్పన సూర్యకుమారి, ఉపసర్పంచి, మామిడికుదురు

ప్రజల్లో చైతన్యం తెస్తా..



పంచాయతీలో పారదర్శక పాలన సాగించడం ద్వారా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నావంతు కృషి చేస్తాను. గ్రామ పంచాయతీల ద్వారా స్థానిక పాలనలో ప్రజలందర్నీ భాగస్వాములు చేయడం ద్వారా చక్కని ప్రయోజనాలు సాధించవచ్చు. – నామన షణ్ముఖ్, వార్డు సభ్యుడు, రాజోలు

తహసీల్దారుగా సుబ్రహ్మణ్యాచారి



మామిడికుదురు: మామిడికుదురు తహసీల్దారుగా వైవీ సుబ్రహ్మణ్యాచారి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన అడ్డతీగల మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అన్ని వినతులను సకాలంలో పరిష్కరించేందుకు అందరి సహకారంతో కార్యాచరణ చేస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన బి.మృత్యుంజయరావు కె.గంగవరం బదిలీ అయ్యారు.

ఈవోపీఆర్డీ రాజు బాధ్యతల స్వీకరణ



ఆలమూరు, న్యూస్‌టుడే: ఈవోపీఆర్డీగా ఎ.రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండపేట నుంచి ఈయన ఆలమూరు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ ఉప్పలగుప్తం వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన రాజును ఎంపీడీవో జాన్‌లింకన్, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

గుంత పూడ్చివేత



రాజోలు నియోజకవర్గంలోని తాటిపాక ప్రధాన కూడలి మలుపులో ఫైబర్ కేబుల్ ఏర్పాటు చేసేందుకు తవ్విన పెద్ద గుంతను పూడ్చివేశారు. అక్కడ తవ్విన గుంత పక్కన ఏవిధమైన రక్షణ లేకపోవడంతో స్థానికుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. దీనిపై 'కూడలిలో గుంత.. రక్షణ లేక కలత' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన నిర్వాహకులు సత్వర చర్యలు చేపట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

– న్యూస్‌టుడే, మామిడికుదురు

ఉద్యాన పంటలపై రైతులు దృష్టిసారించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని హెచ్‌ఈవో డి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మాచవరం, నందంపూడి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తమతమ శాఖల ద్వారా రైతులకు అందిస్తోన్న సేవలను ఈసందర్భంగా వివరించారు.

పాలకుల నిర్లక్ష్యం.. శిథిలమైన రథం

కడలిలోని కపోతేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రథం పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా శిథిలమైంది. 15 ఏళ్ల క్రితం వరకు స్వామివారి కల్యాణ సమయంలో పురవీధుల్లో వైభవంగా ఈ రథంపై ఊరేగింపు నిర్వహించేవారు. దీనికి మరమ్మతులు చేయకపోవడంతో పూర్తిగా పాడైంది. దీంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఈవో సత్యనారాయణరాజును వివరణ కోరగా దాతల సాయంతో కొత్తరథం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పుష్కరాల నాటికి ఏర్పాటవుతుందన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు



సీఎస్సార్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు



నాడు-నేడు పనులపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఓ.ఎన్.జి.సి., ఇతర చమురు సంస్థలు సీఎస్సార్ నిధులు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నాయని.. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'సమస్యలనేకం- చర్చిస్తే ప్రయోజనం' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనంలోని అంశాలపై ఎక్కువగా చర్చ కొనసాగింది. ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు నరేంద్రపురంలో రూ.29 కోట్లతో సమగ్ర రక్షిత పథకం నిర్మాణం, లోవోల్టేజీ సమస్య నివారణకు మానేపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు, నాగుల్లంక పీహెచ్‌సీలో ప్రసవాలు పెరిగేలా చర్యలు, నాడు-నేడు పనులు ముందుకు సాగకపోవడం తదితర అంశాలపై ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుందాలపల్లి- జి.పెదపూడి రహదారి అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. సదరం ధ్రువపత్రాలు లేక దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని, మండలంలో మరొక పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అదనంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సభ్యులు విన్నవించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నివేదికలు రూపొందించి తనకు అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ నెల 14 నుంచి నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గంగాదేవి, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ శ్రీపల్లవి పాల్గొన్నారు.

★ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, ఆ పార్టీ నాయకులు పి.గన్నవరం ఎంపీపీ కార్యాలయం వద్ద సత్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవిని సైతం సన్మానించారు. మండల తెదేపా అధ్యక్షుడు తోలేటి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేటుకూరి

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

మలికిపురం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు కార్యకర్తలు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ కన్వీనరు అడబాల రాంబాబు అధ్యక్షతన బుధవారం కేశనపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలానికి కనీసం పదివేల సభ్యత్వాల నమోదుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలూరు సత్యానందం, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేశ్, చెంపాటి శివరామకృష్ణంరాజు, కాపిశెట్టి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలికకు ఆర్థికసాయం

సఖినేటిపల్లి: గొంది గ్రామంలో విద్యుత్తు ప్రమాదంలో గాయపడి ఒక చెయ్యిని కోల్పోయిన బర్రే దుర్గాభవానీని ఆదుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కాకినాడలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన బాలిక ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఇజ్రాయిల్ దేశంలో ఉన్న జిల్లెళ్ల శేఖర్ ఈ బాలిక పరిస్థితిని తెలుసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా సేకరించిన రూ.60 వేలు, తోటి విద్యార్థులు సేకరించిన రూ.17,500, మట్టపర్రు సర్పంచి రూ.5,000 మొత్తం నగదును బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, సర్పంచి రవికుమార్, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి సేవలు మరువలేనివి: మాజీ ఎమ్మెల్యే

మామిడికుదురు: మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు సేవలను ఎప్పటికీ మరువలేమని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి అన్నారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా మామిడికుదురులోని 216 జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైకాపా నాయకులు కొమ్ముల రాము, జక్కంపూడి వాసు, కటకంశెట్టి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవులను పరిశీలించిన ఆర్డీవో

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం, వద్దిపర్రు, అంకంపాలెం ఇసుక రేవులను బుధవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా రేవుల సమీపంలో గోదావరి నీరు ఉండటం గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఇసుకను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. తహసీల్దారు టి.రాజేశ్వరరావు, ఆర్ఐ భవాని, సర్వేయర్ ప్రభావతి పాల్గొన్నారు.

ట్రాక్టర్ స్వాధీనం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పెదకందాలపాలెం నుంచి నాగుల్లంకవైపు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సికిలే ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చిన్నారులకు పాటల పోటీలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు విజయదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన పాటల పోటీల్లో అనేకమంది చిన్నారులు పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ.3 వేలు రాజోలుకు చెందిన పి.హిమంత్‌శ్రీరామ్, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు అమలాపురానికి చెందిన బి.చైత్రనాగశ్రీ, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి మొగలికుదురుకు చెందిన డి.నందినిచైత్ర అందుకున్నారు. పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



రాజోలు దుర్గమ్మ ఆలయంలో సరస్వతీ పూజ



మామిడికుదురులో...



కొర్లపాటివారిపాలెంలో కుంకుమ పూజలు



రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



అయినవిల్లి: సిద్ధివినాయకస్వామి ఆలయంలో అక్షరాభ్యాసాలు

జగన్మాతకు నీరాజనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం దుర్గాదేవి ఆలయాల వద్ద అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు, చండీ హోమాలు, అభిషేకాలు జరిగాయి.

★ రాజోలు బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద సీనియర్ న్యాయవాదులు చెల్లింగి వెంకటేశ్వర్లు దంపతులు, గుబ్బల రజిత దంపతులు పూజలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, న్యాయవాదులు ఆచంట శ్రీనివాస్, మామిడిశెట్టి శ్రీనివాస్, జి.రవికుమార్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, అంబాజీపేట, రావులపాలెం గ్రామీణం, ఆలమూరు, ఆత్రేయపురం, సఖినేటిపల్లి, అయినవిల్లి



కడలిలో...



తూర్పుపాలెంలో కరెన్సీ నోట్లతో...



ఉచ్చిలి విజయలక్ష్మి అమ్మవారు



తాటికాయలవారిపాలెంలో...

మొత్తుకున్నా పట్టదాయే..

ఆత్రేయపురం: ఆత్రేయపురం వంటి మారుమూల మండలాలకు కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఆలకించడం లేదు. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. రావులపాలెం వయా ఆత్రేయపురం, బొబ్బర్లంక మీదుగా రాజమహేంద్రవరం రూటులో తిరిగే బస్సులు ఇటీవల కాలంలో తరచూ మరమ్మతులకు గురై ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కుంటుసాకులతో కొన్ని బస్సులు అర్ధాంతరంగా రద్దు చేసేస్తున్నారు. మంగళవారం సాయంత్రం షెడ్యూల్ ప్రకారం 6 గంటలకు రావాల్సిన వద్దిపర్రు పల్లెవెలుగు బస్సు ఆత్రేయపురం గ్రామంలోకి రాకుండా రేవులో నుంచే అటుగా వెళ్లిపోయింది. దానికి ముందుగా 5.20 గంటలకు రావాల్సిన బస్సు రిపేర్ పేరిట రద్దు చేశారు. దీంతో బస్టాండులో ఉన్న ప్రయాణికులతో పాటు ప్రైవేటు క్లాసులకు హాజరై తిరిగి స్వగ్రామాలకు వెళ్లే విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు అలాగే ఉండిపోయారు. ఈ సమస్య ప్రయాణికులకు సర్వసాధారణం అయిపోయింది. ఈ సమస్యలపై మండల సర్వసభ్య సమావేశాల్లో ఎప్పటికప్పుడు సభ్యులు ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఫలితం ఉండటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగజేసుకుని కండిషన్‌లో ఉన్న బస్సులు నడపడంతో పాటు రద్దు చేయకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని రావులపాలెం ఆర్టీసీ అధికారి అచ్యుతాంబ వద్ద ప్రస్తావించగా ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని చెప్పారు.



కాటన్ బ్యారేజీపై మరమ్మతుకు గురై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఇద్దరి ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్‌కు సత్కారం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: గోదావరి వరదల సమయంలో జరిగిన పడవ ప్రమాదంలో వెంటనే స్పందించి ఇద్దరి ప్రాణాలు కాపాడటం అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఈ ఏడాది జులై 28న ఊడిమూడిలంకలోకి వరద బాధితుల కోసం తాగునీటి ప్యాకెట్లు మరపడవలో తరలిస్తుండగా జరిగిన బోటు ప్రమాదంలో ఒక యువకుడు చనిపోయాడు. ఆ సమయంలో హెడ్‌కానిస్టేబుల్ బి.మురళీమోహనకృష్ణ స్పందించి ఇద్దరిని ప్రాణాలతో కాపాడారన్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎస్సై బి.శివకృష్ణ, ఎంపీడీవో కె.వి.ప్రసాద్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జీవో ఇచ్చారు.. నిధులు మరిచారు

కలగా పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

గత వైకాపా ప్రభుత్వంలో నిధులు విడుదల చేయకుండా అనేక జీవోలు వచ్చిపడేవి. వాటిని ప్రజలు నిజమని నమ్మేవారు. అలాంటి వాటిల్లో నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఒకటి. రెండున్నర సంవత్సరాల క్రితం సాక్షాత్తు కేబినెట్ ఆమోదించింది. దీనికి జీవో కూడా అప్పట్లో విడుదల చేశారు. నేడో రేపో కేంద్రం ప్రారంభించేస్తాం అన్నంత హడావుడి పాలకులు హంగామా చేశారు. నేటికీ ఇది అతీగతీ లేకుండా పోయింది.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరానికి రెండు కిలోమీటర్ల దూరంలో అంబాజీపేట-గన్నవరం ర.భ.శాఖ రాష్ట్ర రహదారి చెంతన పోతవరం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అప్పట్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు గుర్తించారు. అక్కడ ఉన్న రెండు పాడుబడిన ప్రభుత్వ షెడ్లను హడావుడిగా తొలగించేసి వైకాపా నాయకులు దొడ్డిదారిన అమ్మేసుకున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు స్థలాన్ని అగ్నిమాపకశాఖ అధికారులకు అప్పగించారు. జీవో విడుదల చేసిన ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులు మాత్రం మంజూరు చేయలేదు. నిధులు మంజూరు చేసి ఉంటే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భవనంతో పాటు సిబ్బంది కార్యాలయం నిర్మించేందుకు వీలుండేది. సిబ్బందిని కూడా కేటాయించలేదు. దీనికి సంబంధించి అగ్నిమాపక శకటం ఒకటి హైదరాబాద్‌లో తయారవుతోందని అప్పట్లో వైకాపా నాయకులు వెల్లడించారు. ఇంత జరిగినా ఇక్కడ మాత్రం నేటికీ కేంద్రం ఏర్పాటు కాలేదు.

దీర్ఘ కాలం నాటి సమస్య

పి.గన్నవరం మండలంతో పాటు సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఏడు లంక గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజోలు, అమలాపురం, కొత్తపేట అగ్నిమాపక కేంద్రాలపై ఆధార పడాల్సి వస్తుంది. అంతదూరం నుంచి ఇక్కడికి శకటం చేరుకునేలా ఆస్తులు పూర్తిగా అగ్నికి ఆహుతవుతున్నాయి. ప్రధానంగా వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగిన సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పోతవరం వద్ద రహదారి చెంతన అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలం.. ప్రస్తుతం ఇలా నిరుపయోగంగా మారింది.

నిధులు విడుదల కాలేదు

పి.గన్నవరం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు గతంలో జీవో వచ్చింది. రూ.1.20 కోట్ల నిధులు విడుదల కాలేదు. ఈ నిధులు వచ్చి ఉంటే అగ్నిమాపక శకటం భవనం, సిబ్బంది భవనం వంటివి నిర్మించేందుకు వీలుంటుంది. సిబ్బందిని కూడా కేటాయించాలి. అగ్నిమాపక శకటం మాత్రం కోరుకొండలో సిద్ధంగా ఉంది.

- పార్థసారథి, జిల్లా అగ్నిమాపక అధికారి

వి.వి.వినాయక్ పుట్టినరోజు వేడుకలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

రావులపాలెం గ్రామీణం: ఈతకోటలో వినాయక్ సేవా యూత్ అధ్యక్షులు గంధ్రోతు వీరగోవిందు, దుర్గాసురేష్ ఆధ్వర్యంలో సినీ డైరెక్టర్ వి.వి.వినాయక్ పుట్టినరోజు వేడుకలను బుధవారం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో టోల్ మేనేజర్ గంటా సురేష్, తెదేపా రైతువిభాగం మండలాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు కేకు కోశారు. పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటసురేష్, గుబ్బల రాము, రామలక్ష్మణశర్మ పాల్గొన్నారు.

వరిలో విజృంభిస్తున్న ఎండాకు తెగులు

అయినవిల్లి: వరుస తుపాన్లు, విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఖరీఫ్ పంట చేలను ఎండాకు తెగులు (వైరస్) ఆశిస్తున్నట్లు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు, నత్రజని ఎరువులు ఎక్కువగా వాడకం వల్ల ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. అయినవిల్లి, నేదునూరు, విలస, మాగం తదితర గ్రామాల్లో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. ప్రస్తుతం వరిచేలు ఈనిక దశలో ఉన్నాయి. స్వర్ణ, ఎంటీయూ 1318 రకం వరి చేలల్లో ఈ వైరస్‌ను గుర్తించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు షంషీ తెలిపారు. నత్రజని ఎరువులు వేయొద్దని, ప్లాంటోమైసిన్ సల్ఫేట్ పిచికారీ చేయడం లేదా ఆవుపేడ, మూత్రాన్ని పొలంలో చల్లడం ద్వారా ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని రైతులకు సూచించారు.

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

విద్యార్థులకు బహుమతులు విడుదల

యానాం, న్యూస్‌టుడే: యానాంలో 10, 12 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి చేతుల మీదుగా బుధవారం విడుదల చేశారు. 10, 12వ తరగతుల్లో 60-70 శాతం, 70 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 218 మంది విద్యార్థులకు మత్స్యశాఖ ద్వారా రూ.18,27,000 విడుదల చేసినట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు తెలిపారు. పదో తరగతిలో 70 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారికి రూ.7,500, 60-70 శాతం మార్కులు సాధించిన వారికి రూ.5,000, 12వ తరగతిలో 70 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.15,000, 60-70 శాతం మార్కులు సాధించిన వారికి రూ.7,000 నగదు ప్రోత్సాహక బహుమతులు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు.

కొబ్బరి రైతులకు చెక్కు అందజేత

యానాం, న్యూస్‌టుడే: యానాంలో కొబ్బరి ఉత్పత్తికి సంబంధించి రైతులకు ప్రోత్సాహక రాయితీ చెక్కును పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. యానాంలో 10 మంది ఎస్సీ కొబ్బరి రైతులకు రూ.59,305 వారి ఖాతాలకు జమ చేశారు. శిక్షణ ఐఏఎస్ అంకిత్‌కుమార్, వ్యవసాయాధికారి జోగిరాజు పాల్గొన్నారు.

సర్వీస్ పుస్తకాల డిజిటలైజేషన్‌పై శిక్షణ

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సర్వీస్ పుస్తకాల డిజిటలైజేషన్ ప్రక్రియపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పుదుచ్చేరి బీచ్‌రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో ఐటీ శాఖ డైరెక్టర్ శివరాజ్‌మీనా ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి ఉద్యోగి తమ మెయిల్‌తో పాటు సమాచారం అంతా అప్లోడ్ చేయాలని కోరారు.

అమ్మ రూపం.. జ్ఞాన దీపం


కామాక్షి దేవి పీఠంలో సరస్వతి పూజలో చిన్నారులు

న్యూస్‌టుడే బృందం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. [illegible] దర్శించుకున్నారు. కుండలేశ్వరంలో కొలువైన అమ్మవారికి వివిధ రకాల పిండి వంటల్ని నైవేద్యంగా సమర్పించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం చేశారు. [illegible] అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. [illegible] అమ్మవారు సరస్వతీదేవి రూపంలో బుధవారం దర్శనమిచ్చారు. చండీ హోమం, లక్ష కుంకుమ పూజలు, అభిషేకం చేశారు. విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు.


చినకొత్తలంకలో..


భట్నవిల్లిలో విజయదుర్గ


యానాంలో కన్యకా పరమేశ్వరిదేవి


సరస్వతీదేవి అలంకరణలో అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీవైష్ణవీ కనకదుర్గ, భవానీనగర్ కల్యాణదుర్గ, వేపచెట్టు కనకదుర్గ, కామాక్షి ఏకాంబరేశ్వరి, కాలేజీరోడ్డులోని బాలాత్రిపుర సుందరి దేవి | వెండి చీరలో భద్రకాళీ అమ్మవారు | పళ్లవారిపాలెంలో..

ప్రొటోకాల్ పాటించరా..

వాడీవేడిగా మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అమలాపురం మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో అధికారులు పర్యటించే సమయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని పేరూరు ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి సుబ్బిరామ్ ప్రశ్నిస్తుండగా.. గున్నేపల్లి అగ్రహారం సర్పంచి పెద్దిరెడ్డి రామచంద్రరావు కలుగజేసుకుని వైకాపా పాలనలో సర్పంచులను పట్టించుకున్నారా.. అంటూ వాగ్వాదానికి దిగారు. బుధవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవసాయశాఖకు సంబంధించి వివిధ అంశాలను ఏవో కె.ధర్మప్రసాద్ వివరించారు. ప్రధాన శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ భాగ్యలక్ష్మి మండిపడ్డారు. భట్నవిల్లి కొత్తచెరువు ప్రాంతంలోని అయిదు తరగతులకు ఒకే గది ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి తిరుకోటి సుజాత సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇమ్మిడివరప్పాడులో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించడం లేదని ఈ విషయంలో అధికారులు శ్రద్ధ వహించాలని సర్పంచి రేలంగి దుర్గారావు కోరారు. తాండవపల్లి, రంగాపురం బాబునగర్, కామనగరువు బాలయోగి కాలనీల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యులు రేవు శ్రీనుబాబు, ఉడుము రామకృష్ణ, గుత్తుల అనిత తెలిపారు. ఈదరపల్లిలో ఫిల్టర్‌బెడ్లు పాడైపోయాయని ఏళ్లతరబడి ఈ సమస్యను పరిష్కరించడం లేదని ఎంపీటీసీ సభ్యుడు అడపా సత్తిబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చిందాడగరువు జ్వరాల తీవ్రత ఉన్నప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ తెలిపారు. తాండవపల్లిలో విలేజ్‌హెల్త్ క్లినిక్ నిర్మాణం నిలిచిపోయిందని తక్షణమే పూర్తి చేయాలని సర్పంచి గంగుమళ్ల ఏసుబాబు కోరారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్ సూచించారు. ఎంపీడీవో బాబ్జీరాజు, ఈవోపీఆర్డీ మంగాదేవి, వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యం, పొలమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ శ్రీహరిరామ్‌గోపాల్

తాగునీరు రాదు.. మురుగు కదలదు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పట్టణంలోని ముమ్మిడివరం గేట్ నుంచి నల్లవంతెన వరకు ప్రజలు పలు ప్రధాన సమస్యలతో సతమతవుతున్నారు. ఇక్కడ తాగునీరు పూర్తి స్థాయిలో అందక మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మురుగు కాలువలకు సరైన అవులెట్‌లు లేవు. ఎక్కడనీరు అక్కడే నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడికలు తొలగించి నీరు పారేలా చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కుక్కలు, ఆవులు సంచారం అధికంగా ఉంటోందని, దీంతో ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొళాయిల నుంచి రంగు మారిన, దుర్వాసనతో కూడిన నీరు సరఫరా అవుతోందని వాపోతున్నారు. మంచినీళ్ల ట్యాంకుపైనే ఆధారపడుతున్నామని తెలిపారు.

రహదారులను నిర్మించరూ...

నల్లవంతెన ఎస్పీ కార్యాలయం దగ్గరలో సుమారు 2 కిలోమీటర్లు రహదారి నిర్మించలేదు. నల్లవంతెన నుంచి ఎర్రవంతెనకు వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గుంతలు పడటంతో స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనలు ఇటువైపు వెళ్లడంతో గృహాలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. కిమ్స్ రోడ్డులో రహదారి ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.


అమలాపురంలోని ఎస్పీ కార్యాలయం దగ్గరలో రోడ్డు పరిస్థితి

సమస్యల పరిష్కారానికి కృషి

ఆ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. నిధులు మంజూరైన వెంటనే ఓహెచ్ఆర్‌తో పాటు డ్రెయిన్లు నిర్మిస్తాం. కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేస్తే నల్లవంతెన, ఎర్రవంతెన మధ్య రహదారిని నిర్మించేలా చర్యలు చేపడతాం. మంచినీటి పైపులైన్ నిర్మాణానికి ఆదేశిస్తాం.

– కె.వి.వి.ఆర్.రాజు, మున్సిపల్ కమిషనర్

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు

కాట్రేనికోన: గ్రామాల్లో ప్రజలంతా దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అవినాష్ తెలిపారు. పండుగ వేళ గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదని కోరుతూ బుధవారం పల్లం, బలుసుతిప్ప, పోర, మొల్లేటిమొగ, నీలరేవు తదితర తీర గ్రామాల్లో స్థానికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

అమ్మవారికి కిరీటం

ఉప్పలగుప్తం: ఎస్.యానాంలోని ప్రసన్నాంబికా దుర్గాదేవికి ఊరి ఆడపడుచులు, బంధువులు రూ.43వేలతో వెండికిరీటాన్ని సమకూర్చారు. బుధవారం ఆలయ కమిటీకి ఈ కిరిటాన్ని అందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం: భీమనపల్లిలో పీహెచ్‌సీలో 28 మంది గర్భిణులకు వైద్యాధికారి విష్ణుప్రియ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అదనపు వైద్యసేవల కోసం ఏడుగురిని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఎంపీహెచ్‌ఈవో రామకృష్ణ, సిబ్బంది శోభరత్నం, సత్యవతి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక


నియామక పత్రం అందిస్తున్న కలెక్టర్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి నియామక పత్రాలను అందజేశారు. 172 మంది అభ్యర్థులు హాజరు కాగా 31 మంది ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ డీఎస్సీలో యువతి ప్రతిభ

ముమ్మిడివరం: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో ముమ్మిడివరం అభ్యర్థి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. నల్లగొండ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న ముమ్మిడివరానికి చెందిన మట్టపర్తి సౌమ్య 18వ ర్యాంకును సాధించారు. సౌమ్య తండ్రి మట్టపర్తి రాంబాబు గేదెల్లంకలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

హరియాణాలో భాజపా విజయంపై సంబరాలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ నాయకత్వంలో హరియాణాలో భాజపా విజయకేతనం ఎగురవేయడం హర్షనీయమని స్థానిక భాజపా నాయకులు బుధవారం సంబరాలు జరుపుకొన్నారు. తటవర్తి నాగరాజారావు కార్యాలయం వద్ద కేకును కోసి కార్యకర్తలకు పంచారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

కాట్రేనికోన: ఉప్పూడిలో ఓఎన్‌జీసీ పాత బావి ఉన్న స్థలానికి సంబంధించి లీజు, నష్టపరిహారం చెల్లింపు కోసం గ్రామస్థులు బుధవారం ధర్నా చేపట్టారు. సర్పంచి రంబాల రమేష్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సంస్థ రైతులకు కొన్నేళ్లుగా లీజులు చెల్లించడం లేదన్నారు. 2020లో ఇక్కడ గ్యాస్ లీకైనప్పుడు నష్టపోయిన వ్యవసాయ, ఆక్వా రైతులకు ఇస్తామన్న నష్టపరిహారం నేటికీ ఇవ్వలేదన్నారు. ఓఎన్‌జీసీ వాహనాలు వెళ్లే రోడ్డుకు అడ్డుగా ధర్నా చేపట్టారు. బొబ్బిలి పాపారావు, మద్దింశెట్టి శ్రీనివాసరావు, గొలకోటి మాచరరావు, రంబాల త్రిమూర్తులు, రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లాకు అరుదైన గౌరవం



ఉప్పలగుప్తం: అమలాపురం పట్టణానికి చెందిన సాహితీ వేత్త, కవి డా.నల్లా నరసింహమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపక సంఘం గౌరవ ఉపాధ్యక్షుడిగా ఆయనను ఎన్నుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

ఒక్క రోజు.. 1069 దరఖాస్తులు

అమలాపరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 133 మద్యం దుకాణాలకు బుధవారం నాటికి 2738 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 1,069 దరఖాస్తులు ఒక్క బుధవారమే రావడం గమనార్హం. అమలాపురం స్టేషన్ పరిధిలో 28 దుకాణాలకు 839 దరఖాస్తులు వచ్చాయి. తొలుత విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బుధవారం చివరి రోజు కావడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మరో రెండు రోజులు గడువు పెంచుతూ ప్రభుత్వం రీషెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో దరఖాస్తులు దారులు మరింత పెరిగే అవకాశం ఉంది.

గరిష్ఠం 45.. కనిష్ఠం 19..

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలను దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. కాట్రేనికోన మండలంలోని ఓ దుకాణాలకు కనిష్ఠంగా 19, ముమ్మిడివరం మండలంలోని మరో దుకాణానికి గరిష్ఠంగా 45 దరఖాస్తులు వచ్చాయి. ఐ.పోలవరం మండలంలో మూడు మద్యం షాపులకు 102, కాట్రేనికోన మండలంలో ఆరుకు 149, ముమ్మిడివరం మండలంలో నాలుగుకు 137 కలిపి సర్కిల్ పరిధిలో 388 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు.

మండపేట

అమ్మవారికి ఆభరణాల సమర్పణ



అమ్మవారికి వెండి చీర ఆభరణాలు అందజేస్తున్న డాక్టర్ సునీల్ కుటుంబ సభ్యులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ప్రధాన రోడ్డు కృత్తివెంటి విద్యాట్రస్టు ఆవరణలో ఉన్న స్వయంభూ జ్ఞాన సరస్వతి అమ్మవారికి పట్టణానికి చెందిన డాక్టర్ సి.సునీల్ చౌదరి కుటుంబ సభ్యులు రూ.2.5లక్షలు విలువ చేసే సుమారు 3 కేజీల వెండి చీరను, ఆభరణాలను సమర్పించారు.



వెండి చీరతో జ్ఞాన సరస్వతి

రోడ్డు అంచు దిగితే ప్రమాదమే

మండపేట: పట్టణంలోని పెదకాలువ సమీపంలో పులే విగ్రహం సమీపంలో వంతెన వద్ద రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనాల రాకపోకల సమయంలో గోతిలో పడుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మార్జిన్‌బాగు చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు. రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని రభ శాఖ డీఈ సూర్యనారాయణ తెలిపారు.



పులే విగ్రహం సమీపంలో కుంగిన రహదారి

వీణాపాణి నమోస్తుతే..!



రామచంద్రపురంలో..



ద్వారపూడిలో..



వెదురుపాకలో..



ఆదివారపుపేట ఆశ్రమంలో..



కోరుమిల్లిలో..



పామర్రులో...

మండపేట, మండపేట గ్రామీణం: దసరా మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులను అనుగ్రహించారు. మండపేట పట్టణంలో అగస్త్యేశ్వర స్వామి ఆలయం, కలువపువ్వు సెంటరులో, ధర్మగుండం చెరువు తదితర చోట్ల ప్రత్యేక పందిళ్లలో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో పూజలందుకున్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరణ చేశారు. అమ్మవారిని వెండి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఇప్పనపాడు బొమ్మలగుడి వద్ద భవానీ భక్తులు అమ్మవారిని సరస్వతీ అమ్మవారిగా అలంకరించారు. పాలతో



రామచంద్రపురంలో కుంకుమ పూజలు



మండపేటలో..

దులో కుంకుమ పూజ నిర్వహించారు.

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో ప్రధాన రోడ్డు స్వయంభూ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, పార్కువద్ద, కొత్తూరు రోడ్డు, శీలంవారి సావరం రోడ్డులో అమ్మవారికి భక్తులు పూజలు చేశారు.

ద్వారపూడి: ద్వారపూడిలో పాత వస్త్ర దుకాణ సముదాయం వద్ద ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు, ద్వారపూడి బ్యాంకు వీధిలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో విజయదుర్గాదేవి జ్ఞానసరస్వతిగా చదువుల తల్లి భక్తులతో పూజలందుకుంది.

అంగర: కపిలేశ్వరపురం దుర్గా పీఠంలో, పెద్ద కోరుమిల్లి రథం వీధిలోనూ, అంగర పల్లపు వీధిలోనూ, కపిలేశ్వరపురం దేవీసెంటర్‌లో సరస్వతీ పూజల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయంలో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు ఆలయ ఈవో దుర్గాభవాని పెన్నులు, పుస్తకాలు అందించారు. ద్రాక్షారామ సాక్షివారి వీధిలో ముత్యాలమ్మ ఆలయం వద్ద, వెలంపాలెం గోగులాంబ ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో దుర్గాదేవిని, ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో అలంకరించారు.

పామర్రు: పామర్రులో ఉమాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ రూపంలో అలంకరించారు. సామూహిక సరస్వతీ పూజలు జరిపించారు.



పామర్రు ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు



పెద్ద కోరుమిల్లిలో...

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

స్పందనకు వందనం

వంతెనపై పారిశుద్ధ్య పనులు

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ద్వారపూడి వైవంతెనపై పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణకు వివరించగా స్పందించారు. వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టి చెత్త తొలగించారు.

బాధ్యతల స్వీకరణ

మండపేట గ్రామీణం: మండపేట ఈవోపీఆర్డీగా దాసరి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు మండలంలో ఈవోపీఆర్డీగా పనిచేశారు. ఇప్పటివరకు పనిచేసిన ఉయ్యూరు ఆలమూరు మండలం బదిలీపై వెళ్లారు. కేశవరం పంచాయతీ కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారావు, ఏడిద పంచాయతీ కార్యదర్శులు పుష్పాల శ్రీనివాస్, మారేడుబాక వి.వి ప్రసాద్‌బాబు, తాపేశ్వరం చక్రధర రెడ్డి, పాలతోడు వి.వర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

రాయవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాయవరం ఏవో ప్రభాకర్ తెలిపారు. బుధవారం వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల అభీష్టంమేరకు ధాన్యాన్ని స్థానిక రైస్‌మిల్లులకు విక్రయించుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడిగేవారు లేక.. ఆక్రమించేస్తున్నారు



తవ్వకాలు జరుగుతున్న స్థలం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు కావడం.. పాలకులు పట్టించుకోకపోవడం.. అధికారుల ఉదాసీనత వెరసి ఆక్రమణదారులకు అడ్డులేకుండా పోతోంది. మండలంలోని ఏడిద కొత్తూరు నుంచి సంపం పుంత రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురవుతోంది. రెండెకరాల క్రితం వెడల్పుగా ఉన్న పుంత రోడ్డును స్థానిక రైతు ఆక్రమించి దాని ఆనవాలు లేకుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. నాలుగు రోజులుగా గొడ్డుకావలి గట్టును ఒక రైతు తన సొంతానికి తవ్వుకుంటూ పోతున్నాడు. తోటి రైతులు ప్రశ్నిస్తే, తన సొంత స్థలం అంటూ ప్రశ్నించిన రైతులను బెదిరిస్తున్నాడని వివరిస్తున్నారు. ప్రభుత్వ కాలువగట్టును తవ్వుకుపోతున్న ప్రాంతంపై అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వీఆర్వోకు స్థానిక రైతులు పరిస్థితిని వివరించారు. తహసీల్దారు, కలెక్టరు దృష్టికి తీసుకెళ్లనున్నామని రైతులు తెలిపారు. దీనిపై 'న్యూస్‌టుడే' సంబంధిత ఇరిగేషన్ డ్రైనేజీ డీఈ పోచారావుని ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆక్రమిస్తే చర్యలు

డ్రైనేజీ జేఈ స్థాయి అధికారి, సిబ్బంది పరిశీలిస్తారు. కాలువగట్టును ఆక్రమిస్తే మాత్రం కఠిన చర్యలు ఉంటాయి. ఎంత కాలువగట్టు ఉంది అనే విషయాన్ని పరిశీలిస్తాం.
- పోచారావు, ఇరిగేషన్ డీఈ, రామచంద్రపురం

ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు

మండపేట, న్యూస్‌టుడే: పర్యావరణంతోపాటు ప్రజల ఆరోగ్యానికి ప్లాస్టిక్ కవర్ల వినియోగం ముప్పుగా మారిందని దీని నిషేధానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగారావు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా వినియోగించి కాలువలో వేయడంతో మురుగు నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని దీనివల్ల దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ముందుగా వ్యాపారులకు విక్రయదారులకు అవగాహన కల్పించాలని తదుపరి కార్యాచరణగా దాడులు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఆస్తిపన్ను, కొళాయి పన్ను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, టీపీవో శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, రెవెన్యూ అధికారి శాస్త్రి పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో సమీక్ష చేస్తున్న కమిషనర్

ఎమ్మెల్యే వేగుళ్ల తులాభారం



ఎమ్మెల్యే వేగుళ్లకు తులాభారం వేస్తున్న కూటమి నాయకులు

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడి గ్రామం శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో మండపేట శాసనసభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావుకు తెదేపా మండపేట మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జి ఆధ్వర్యంలో తులాభారం ఏర్పాటు చేశారు. మండపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించాలని ఎన్నికల్లో మొక్కుకున్న మొక్కు నెరవేరడంతో బుధవారం ద్వారపూడి అయ్యప్ప ఆలయంలో కూటమి నాయకులతో కలిసి తులాభారం ఏర్పాటు చేశారు. తొలుత అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకుడు కనకరాజు గురుస్వామి ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కూటమి నాయకులు ఎమ్మెల్యేను 80కేజీల పటికబెల్లంతో తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, వేగుళ్ల అజయ్‌బాబు, తులా విష్ణుమూర్తి, చేకూరి రమేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పాలు, రొట్టెలు పంచుతున్న చంద్రశేఖర్

రామచంద్రపురం: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు ట్రస్టు పేరుమీద పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రతి నెల పంపిణీ చేస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, కంచుమర్తి బాబూరావు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, నారపరెడ్డి బలరాం తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, పురపాలక సంఘ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను కూటమి పార్టీల నాయకులు బుధవారం ఏర్పాటు చేశారు.

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా.విష్ణువర్ధన్ 21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా రక్తపరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్యాధికారి డా.విష్ణువర్ధన్ మాట్లాడుతూ గర్భిణులు రోజూవారీ ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, చేర్చుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు, స్టాఫ్ నర్సు శ్యామల, హెల్త్ విజిటర్ మేరీమణి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

రైలు ఢీకొని మహిళ మృతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. కేశవరం రైల్వే గేటు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుంది. ఒంటిపై పసుపు, పచ్చ, ఎరుపు రంగుల డిజైన్ చీర, పచ్చరంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె ఏ ప్రాంతానికి చెందినది అనేది ఇంకా తెలియలేదని, వివరాలు తెలిసినవారు 94910 03239 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు కదలనంటోంది

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ నుంచి ఆదివారపుపేట వెళ్లే మార్గంలో మండాలమ్మపేట వద్ద డ్రైనేజీ అధ్వానంగా మారింది. బియ్యంపేట నుంచి మండాలమ్మపేట వద్ద ఉన్న మురుగు కాలువ వరకు ఉండే కాలువను ఇటీవల అభివృద్ధి పనుల్లో భాగంగా కొంత వరకు నిర్మించారు. దీంతో కొంత సమస్య తీరినా మిల్లు దగ్గర నుంచి మురుగు కాలువ వరకు కాలువ నిర్మించకుండా వదిలేదయంతో ప్రస్తుతం ఇది అధ్వానస్థితికి చేరింది. ఇది పూర్తిగా కచ్చా కాలువ కావడంతో దీనిలో మురుగునీరు కూడా ముందుకు పారే పరిస్థితి లేదు. అప్పుడప్పుడు చెత్తను తొలగించినా తిరిగి యథాస్థితికి చేరుకుంటుంది. దీని వల్ల స్థానికంగా ఉండే వారికి తీవ్ర దుర్గంధంతో పాటుగా దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. మరోపక్క ఈ డ్రైనేజీ వల్ల ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ రహదారి మలుపులా ఉండటం దానికి బెర్మ్ లేకపోవడం వల్ల అదుపుతప్పి వాహనాలు డ్రైనేజీలోకి పడిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కనీసం రహదారికి బెర్మ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై సర్పంచి కొత్తపల్లి అరుణ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో కాలువలు నిర్మిస్తూ వస్తున్నామన్నారు. నిధులు వెసులుబాటును బట్టి ఈ డ్రైనేజీ కూడా పూర్తి చేస్తామన్నారు.



మండాలమ్మపేట వద్ద కాలువ దుస్థితి

ప్రధాన సమస్యలకు పరిష్కారమెప్పుడో..!

మా ఊరి సమస్య

మారేడుబాక (మండపేట గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని మారేడుబాక గ్రామాన్ని డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. రహదారి పక్క చెత్తాచెదారాలు వేసి, నిప్పుపెడుతున్న పరిస్థితి. కపిలేశ్వరపురం వెళ్లేరహదారిలో ప్రధాన రహదారిపై చెత్తాచెదారాలు వేయడం వల్ల వర్షం వస్తే నీరు వెళ్లేదారిలేక రహదారులపై గుంతలు పడుతున్నాయి. గ్రామంలో జనాభా పెరుగుతున్నప్పటికీ మౌలిక వసతుల కల్పన ఆస్థాయిలో లేదు. మారేడుబాక- పులగుర్త వెళ్లేదారిలో చిన్నపాటి డంపింగ్ యార్డు ఉన్నా ప్రస్తుతం ప్రజా అవసరాలకు అరకొరగానే ఉంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ప్రధానరిదారిలో నీరు నిలిచిపోతోంది. అందువల్ల దోమలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కపిలేశ్వరపురం- మండపేట రహదారిపై గోతులు భారీగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎంపీడీవో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు పరిస్థితిని పరిశీలించామన్నారు. ప్రధాన రహదారిలో చెత్తాచెదారాలు వేయకుండా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.



మారేడుబాక సాయినగర్ కాలువగట్టు వద్ద పరిస్థితి

జనాభా: 4276 | వార్డుల సంఖ్య: 16 | పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య: 8 | రోజుకు సేకరించే చెత్త: 6 ట్రాక్టర్లు